క్లుప్తంగా

భూ సమస్యలను పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో రెవెన్యూ అధికారులకు రైతులు అర్జీలు ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. సి.బెళగల్, కంబదహాల్, తిమ్మందొడ్డి, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, మారందొడ్డి గ్రామాల రైతులు భూ సమస్యలపై తహసీల్దార్ శేషఫణికి అర్జీలు ఇచ్చారు. బియ్యం కార్డు మంజూరు చేయాలని, గ్రామాల్లోని పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులకు అర్జీలిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా, ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సి.బెళగల్ సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, వీఆర్వోలు ఉన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంపీపీ బొంతల మునెప్ప

సి.బెళగల్: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. సోమవారం ఆయన స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు నిర్వహించే ఫిజియో థెరపీని పరిశీలించారు. ఫిజియోథెరపిస్ట్ వీరేష్ దివ్యాంగులకు వ్యాయామం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రానికి తీసుకొచ్చి వ్యాయామం ద్వారా నయం చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు సోమశేఖర్‌రెడ్డి, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేయండి

సి.బెళగల్: ఉపాధి పనులను తనిఖీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు రూ.7.5 కోట్ల నిధులతో చేపట్టిన 812 పనులపై సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజ్, టీఏలు, ఎఫ్‌ఏలు, సీనియర్ మేట్‌లు, ఎంసీఓలు, డీఆర్‌పీలు ఉన్నారు.

సీసీ డ్రైన్ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ గాడి రూతమ్మ, సర్పంచు భాగ్యరత్న

కోడుమూరు రూరల్: స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో సీసీ డ్రైన్ నిర్మాణానికి సోమవారం ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సర్పంచు భాగ్యరత్న భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండల నిధులు రూ.5 లక్షలతో సీసీ డ్రైన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈ గంగరాజు, ఎస్‌ఐ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు రమేష్‌నాయుడు, లింగన్న, డిష్ రవి, ఏఐటీయూసీ రాజు, ఆంధ్రయ్య పాల్గొన్నారు.

రూ.3 లక్షలు దాటిన నియోజకవర్గ ఓటర్లు

పాణ్యం: ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక ఓటర్లు కల్గిన నియోజకవర్గం పాణ్యం. ఎప్పటిలాగానే ఈ సారి కూడా ఓటర్ల సంఖ్యలో 3 లక్షలు దాటింది. పాణ్యం నియోజకవర్గంలో ప్రస్తుతం 339 బూత్‌లు ఉండగా అదనంగా కల్లూరు మండలంలో మరో బూత్‌ను పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ బూత్ ఏర్పడితే 340 బూత్‌లు అవుతాయి. 2019 సార్వత్రిక ఎన్నికల నాటికి పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 2,88,031మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,41,736మంది పురుషులు, 1,46,226 మంది స్త్రీలు, 69 మంది ఇతరులు ఉన్నారు. ఇటీవల ఓటర్లకు సంబంధించి మార్పులు చేర్పులతో ప్రస్తుతం 3,08,035 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,50,895 మంది పురుషులు, 1,57,064 మంది స్త్రీలు ఉన్నారు. ఇతరులు 76 మంది ఉన్నారు. 2019 నుంచి 2024కు ఇప్పటి వరకు మహిళలు 1,679 మంది పెరిగారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో కాస్తా అటు ఇటూ కావచ్చని అధికారులు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు పైగా ఓటర్లు కలిగిన పాణ్యం నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచింది.



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు



ఎర్రకత్వలో పరీక్షలు చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు



పాణ్యం-2లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పెసరవాయిలో ఆరోగ్య రక్ష టోకెన్ అందజేస్తున్న డాక్టర్ మొల్ల జబీన్

వేగంగా ఆరోగ్య సురక్ష సర్వే

- ఇంటింటికి వెళ్లి వ్యాధి గ్రస్తుల వివరాలు సేకరిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు
- బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి టోకెన్లు జారీ..



సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో వృద్ధుడు మల్లెపోగు బజారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కోడుమూరు రూరల్/సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాలో చురుగ్గా సాగుతోంది. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికి తిరిగి వివిధ వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించి నమోదు చేసుకుంటున్నారు. బీపీ, షుగర్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వాధ్యులతో బాధ పడుతున్నవారికి మందులు ఇస్తున్నారు. మరి కొందరికి ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు నిర్వహించనున్న హెల్త్ క్యాంపులలో వైద్యం చేయించుకునేందుకు టోకెన్లు ఇస్తున్నారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం సేవలను ఎలా వినియోగించుకోవాలో తెలియజేస్తున్నారు. సోమవా రం కోడుమూరు పట్టణంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించి ఏఎన్‌ఎంలు, వలంటరీలకు పలు సూచనలిచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఉద్దేశమన్నారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోనూ ఆరోగ్య సురక్ష సర్వేను చేపట్టారు.

పాణ్యం నియోజకవర్గంలో..

పాణ్యం/కల్లూరు/గడివేముల: నియోజకవర్గంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కొనసాగుతోంది. సోమవారం ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులను నమోదు చేస్తున్నారని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ సునీత చెప్పారు. అవసరమైన వారికి టోకెన్లు అందజేశారు. కల్లూరు మండలం ఉలిందకొండ, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. గడివేముల మండలం పెసరవాయి గ్రామంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డాక్టర్ మొల్ల జబీన్ తనిఖీ చేశారు. బీపీ, షుగర్, క్షయ, డెంగీ, మలేరియా, యూరిన్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను సేకరిస్తున్నట్లు డాక్టర్ తెలిపారు.



గడివేములలో వృద్ధురాలికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



కొత్రపోలూరులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



ఉలిందకొండలో సర్వేలో పాల్గొన్న ఏఎన్‌ఎం



కొంగనపాడులో వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న ఏఎన్‌ఎం

గ్రామాల అభివృద్ధికి కృషి

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ కార్యవర్గ సభ్యుల పదవీ కాలం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీని, మండల పరిషత్ కార్యవర్గ సభ్యులను అభినందించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, నాయకులు రఘురెడ్డి పాల్గొన్నారు.

'సుంకేసుల'లో 0.990 టీఎంసీల నీరు నిల్వ



సుంకేసుల జలాశయం

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 0.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు సోమవారం డ్యాం అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 935 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో నిలిచిపోవడంతో దిగువకు నీటి విడుదల నిలిపేశామని అధికారులు పేర్కొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కర్నూలు మండల విద్యాశాఖ అధికారిణి విజయకుమారి అన్నారు. సోమవారం స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు హాకీ పోటీలు, అలాగే స్థానిక బి.క్యాంప్ పాఠశాల క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆమె ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ పాల్గొన్నారు.

నీటిసంపులో పడి బాలుడి మృతి



మణికంఠ

కర్నూలు : కల్లూరు మండలం శరీన్‌నగర్‌లో నివాసముంటున్న రాఘవేంద్ర, మంజుల దంపతుల కుమారుడు మణికంఠ (5) ఇంటి పక్కనున్న నీటిసంపులో పడి మృతిచెందాడు. బాలుడు అంగన్‌వాడీ బడిలో 1వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలోని గణేష్ మండపం దగ్గర ఉంటాడులే అని భావించి నిర్లక్ష్యం చేశారు. రాత్రి పొద్దుపోయే దాకా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణికంఠ తండ్రి రాఘవేంద్ర ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బాలుడి కోసం కాలనీ మొత్తం గాలించినా ఆచూకీ లభించ లేదు. ఆదివారం మధ్యాహ్నం సమీపంలోని కాలువలు, నీటితొట్లలో పరిశీలించగా సంపులో శవమై కనిపించడంతో రాఘవేంద్ర కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రాఘవేంద్రకు ముగ్గురు కూతుర్లు ఉండగా చివరివాడు మణికంఠ.



పంచలింగాలలో పేరుకుపోయిన చెత్తాచెదారంలో పందుల స్వైరవిహారం



ప్రధాన రహదారి పక్కనే వేసిన చెత్తాచెదారం

పడకేసిన పారిశుద్ధ్యం

- పంచలింగాల ప్రధాన రోడ్డుపైనే పేరుకుపోయిన చెత్తాచెదారం
- పందులు, దోమలు స్వైరవిహారం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు భరించలేకపోతున్నారు. మూడు నెలలుగా గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారంతో నిండిపోయాయి. మరోవైపు ఊరి చివర జాతీయ రహదారి పక్కనే ఉన్న కాల్వ పక్కనే చెత్తాచెదారం, పాతదుస్తులు, కోళ్ల వేస్టేజీ గుట్టలుగా పడేశారు. ముక్కుపూటాలదిరేలా దుర్గంధం వెదజల్లుతుండటంతో అటువైపు వెళ్లేవారు ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షం పడితే రోడ్లపై నీళ్లు నిలవడం అదే నీటిలో పందులు, దోయలు స్వైర విహారం చేస్తున్నాయి. అసలే వర్షాకాలం ఆపై అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా కర్నూలు మండల ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడల్లో రాణిస్తున్న గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

కల్లూరు: చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ఈ నెల 24వ తేదీన అన్నమయ్య జిల్లా నల్లకుంటపల్లి జరిగిన క్రికెట్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ జూనియర్ బాలుర అండర్-19లో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. పోటీల్లో రాణించిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్, పీఈటీలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్చీ నిర్మాణానికి భూమిపూజ



గడిగరేవుల గ్రామంలో భోగేశ్వరాలయానికి వెళ్లే రహదారికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

గడివేముల: దక్షిణకాశీగా పిలువబడే శ్రీ దుర్గాభోగేశ్వరాలయం వెళ్లే దారిలోని గడిగరేవులలో బస్టాండు ప్రాంతంలో ఆర్చీ నిర్మాణానికి సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ గోదా ప్రసాద్‌లు సోమవారం భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన దాత బీఎస్ శ్రీనాథ్‌రెడ్డి రూ.6 లక్షలు ఆర్చీ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆర్చీ నిర్మాణానికి సహకరించిన దాతను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, వెంకటరమణ, శివుడు, చింతల నారాయణ, వడ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: వర్షాభావ పరిస్థితుల వల్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు రూపొందించడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారన్నారు. అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మధు, రైతు సంఘం నాయకులు హరిబాబు, షేక్షావలి, సుదర్శనం, రాజు, సుధాకర్, శంకర్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

గూడూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై పొదుపు సంఘాల లీడర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా దృష్టి సారించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తతో పాటు హానికరమైన చెత్తపై అవగాహన పెంచుకోవాలన్నారు. చెత్త సేకరణ తమ సిబ్బంది ఇంటింటికీ వస్తారని, అప్పుడు తడి, పొడి, హానికర చెత్తను వేరువేరుగా అందజేసి సహకరించాలన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం



స్పందనతో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి

ఓర్వకల్లు: ప్రజా సమస్యల కోసం నిర్వహిస్తున్న 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపుతామని తహసీల్దార్ శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వివిధ సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. నన్నూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల 1245 సర్వే నంబర్‌లో 45 సెంట్లు భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలని గ్రామానికి చెందిన మద్దిలేటి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కన్నమడకల రెవెన్యూ పరిధిలో గల 385 సర్వే నంబర్‌లో మొత్తం 3.12 ఎకరాలకు గాను 1.85 సెంట్లు ఎయిర్ పోర్టులో పోగా, మిగతా 1.85 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో ఎక్కించాలని గ్రామానికి చెందిన తిరుపతయ్య విన్నవించారు. మొత్తానికి రెవెన్యూ సమస్యలపై పది మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ-2 ఓంకార్ యాదవ్, హౌసింగ్ ఏఈ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరుకు చేరిన దళిత రక్షణ యాత్ర



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ

గూడూరు: దళిత రక్షణ యాత్ర జీపు జాతా సోమవారం గూడూరు పట్టణానికి చేరుకుంది. పాత బస్టాండ్ వద్ద జరిగిన సభలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఏ పార్టీలు అధికారంలో ఉన్నా దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. అగ్రవర్ణాల దాడుల వల్ల గ్రామాలు విడిచి వెళ్తున్న దళితులకు అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కార్యదర్శి ఆనంద్‌బాబు, సీఐటీయూ కార్యదర్శి మోహన్, కోడుమూరు కార్యదర్శి జీపీ వీరన్న, నాయకులు విజయమ్మ, నాగరాజు, శేషన్న, మధు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు



హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఆయన జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మతో కలిసి స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ, ఎస్‌సీ కళాశాల బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆయా వసతి గృహాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే ఆయన హాస్టళ్లలోని సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే హాస్టళ్లలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాల నుంచి వచ్చిన విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారిణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, డీన్

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

పాణ్యం: ఉన్నత లక్ష్యాలతో చదవాలని ఆర్‌జీఎం కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ విద్యార్థులకు సూచించారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.25 వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్ హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

అన్నదానం



కల్లూరులో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కల్లూరు: వినాయక చవితి సందర్భంగా కల్లూరు అర్బన్‌లో వివిధ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పాత కల్లూరులో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.